APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com



పోలీసుశాఖతో పెట్టుకోవద్దు 2లో




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటి బిల్లు 2లో

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | బుధవారం | 26-03-2025 | సంపుటి : 15 | సంచిక : 241 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి

# పిరాయింపులకు ఏడాది పూర్తి!





- ఆశ్చర్యం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ కొనసాగింపు
- గత తీర్పులను ఎలా కాదనగలమన్న ధర్మాసనం
- వాదోపవాదాల తర్వాత విచారణ ఏప్రిల్ 2కు వాయిదా

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు చర్య తీసుకునేందుకు తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది అరియామా వాదనలు వినిపిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీసులు ఎటువెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది

మిగతా 2వ పేజీలో...

# కార్డుల కథ కంచికే?




- అందని రేషన్‌కార్డులు
- పత్తా లేని హెల్త్‌కార్డులు
- ఊసెత్తని రేవంత్ సర్కార్
- సంబరానికే సర్వేలు
- ప్రజలకందని ఫలాలు
- సగం మందికి కూడా అందని సంక్షేమ పథకాలు
- అటకెక్కిన గ్రామ, వార్డు సభలు
- అర్జీలు పెట్టుకునేందుకు పడిగాపులు
- ప్రజాపాలన కాస్త పైరవీల పాలనాయే

**హైదరాబాద్- నీలగిరివార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటించారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత్ ప్రకటించినా ఇద్దరూ మాటతప్పారు. గతేడాది జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసంధానం చేయనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధించిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయనా అన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కానీ ఏడాది

మిగతా 2వ పేజీలో...

కార్డుల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఆ కార్డు, ఈ కార్డు అంటూ ఊదరగొట్టిన సీఎం రేవంత్ సర్కారు ఇప్పుడు ఊసెత్తడం లేదు. మొన్నటికి మొన్న రేషన్‌కార్డులు ఇదిగో అదిగో అంటూ గొప్పలు పోయిన ప్రభుత్వం వాటిని జారీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో డిజిటల్ హెల్త్‌కార్డులు ఇస్తామని ప్రగల్భాలు పలికి గాలికొదిలేసింది. ఇక ప్రతీ పథకంలో రేషన్‌కార్డును తప్పనిసరి చేసి.. నిరుపేదల ఆశలపై నీళ్లు జల్లింది. మొత్తంగా కార్డుల పేరిట నిరుపేదల జీవితాలను మూడుముక్కలాటగా మార్చింది.





## బట్టలు విప్పుడు.. కత్తులు దూసుడు

- అసెంబ్లీ సమావేశాలపై మల్లారెడ్డి వ్యాఖ్యలు

**హైదరాబాద్- నీలగిరివార్త :**
మాజీ మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడటం ఆయన నైజం. ఆయన విచిత్రంగా పలు స్టేజీలమీద, విలేకరుల సమావేశాల్లో పలు కామెంట్లు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మీద మంగళవారం కామెంట్ చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని

మిగతా 2వ పేజీలో...

# రెండు పెండింగ్!

- నాలుగు మంత్రి పదవులే భర్తీ
- క్యాబినెట్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్
- చీఫ్‌విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు మోక్షం
- మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు
- మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు



**హైదరాబాద్- నీలగిరివార్త :**
ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్తులను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో...




## ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

- మరో ముగ్గురు మావోల హతం

**రాయపూర్- నీలగిరివార్త :**
ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులను మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు దంతెవాడ, బిజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవిలో ఈరోజు ఉదయం 8 గంటల

మిగతా 2వ పేజీలో...



# ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ


- మేలో తల్లికి వందనం అమలు
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి
- 2027కు పోలవరం పూర్తి చేస్తాం
- 2027లోగా రాజధాని పూర్తి
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నిర్దేశం

**అమరావతి- నీలగిరివార్త :**
ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు- ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ.. కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అంటూ..ఏసీ రూ-మ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో

మిగతా 2వ పేజీలో...


# సొరంగంలో మరో శవం

- టన్నెల్‌లో డెడ్‌బాడీని గుర్తించిన రెస్క్యూ టీం
- ఇప్పటికి రెండు మృతదేహాలు వెలికితీత
- మరో ఆరుగురి ఆచూకీ కోసం రెస్క్యూ
- ఎస్ఎల్‌బీసీ ఘటనలో గాలింపు చర్యలు



**మహబూబ్‌నగర్- నీలగిరివార్త :**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా

మిగతా 2వ పేజీలో...



## మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్

- తప్పుడు లెక్కలపై నిలదీత

2లో

# స్పీకర్ వ్యాఖ్యలతో బాధ కలిగింది!

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన
- తానెక్కడా పరిధి దాటలేదని వివరణ
- తనను అలా ఎందుకు అన్నారని ప్రశ్న
- తన వ్యాఖ్యలను తొలగిస్తాన్న స్పీకర్



**హైదరాబాద్ - నీలగిరివార్త :**
స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడాను తప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. "సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే


మిగతా 2వ పేజీలో...

# జమిలి ఎన్నికల జేపీసీ గడువు పొడిగింపు

- లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని 2025 వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు పొడిగించే ప్రతిపాదనను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2024 , కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు- 2024 పై లోక్‌సభలో నివేదిక సమర్పించడానికి సమయాన్ని పొడిగించాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పిపి చౌదరి మంగళవారం ప్రతిపాదించారు. దీనిని సభ మూజువాణి ఓటు- ద్వారా ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై మోడీ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బీజేపీ ఎంపీ, మాజీ న్యాయశాఖ మంత్రి పిపి చౌదరి అధ్యక్షతన 39 మంది సభ్యుల జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు-చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చుచ, సమయం ఆదా అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం అంగీకరించడం లేదు. తాజాగా జెపిసి చైర్మన్, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి పిపి చౌదరి గడువు హెచ్చింపు కోసం తీర్మానాన్ని లోక్‌సభలో ప్రతిపాదించారు. సభ మూజువాణి వోటుతో తీర్మానానికి ఆమోదం తెలిపింది. రాజ్యసభ నుంచి ఒక కొత్త

మిగతా 2వ పేజీలో...



2లో

## మొత్తం 35 సవరణలకు అనుమతి

- లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం

ఆన్‌లైన్ ప్రకటనలపై 6శాతం డిజిటల్ పన్ను రద్దుతోపాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్‌సభ ఆమోదించింది.



## మొత్తం 35 సవరణలకు అనుమతి

- లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ- నీలగిరివార్త :
ఆన్‌లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం ప్రక్రియ లోక్‌సభలో పూర్తయింది.ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం ప్రక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపి 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

**బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్**



**హైదరాబాద్- నీలగిరివార్త :** ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగానే పోలీసులు వింటారని, పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తున్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు కూడా పంపించారని రాజా సింగ్ గుర్తుచేశారు. అయితే ఇందులో షాకింగ్ విషయం ఏంటంటే.. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే సమయంలో సొంత పార్టీ నేతలు, కొంతమంది బీజేపీ అధికారులు.. పోలీసులకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని ఓ పోలీస్ అధికారే స్వయంగా తనతో చెప్పారన్నారు. అయితే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, బీజేపీ అధికారులను ఏం చేయాలని ప్రశ్నించారు.

## స్పీకర్ వ్యాఖ్యలతో బాధ కలిగింది!

మొదటిపేజీ తరువాయి..

ఉంటుందని తెలిపారు. నిన్న మీరు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చానన్నారు. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా.. నాకే వినబుద్ధి అవడంలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధ కలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదని.. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ.. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతానని తెలిపారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. తాను తప్పేం మాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మానంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు' అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలంటే తనకు ఎనలేని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. 'మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపులా నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నదన్నారు. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదని తెలిపారు. మీకు వినబడుతున్నదా అని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను.' అని చెప్పారు.

## బట్టలు విప్పుడు.. కత్తులు దూసుడు


మొదటిపేజీ తరువాయి..

ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజ్‌పేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుపోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశాదరు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంగళవారం అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి పలుకరింపులు ఆసక్తిగా మారాయి.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐటి బిల్లు

- సెలెక్ట్ కమిటీ ముందుకు నివేదిక
- ప్రసాదాలపై జిఎస్టీ ఎత్తివేత
- ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ- నీలగిరివార్త :
కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానంఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు. సెలెక్ట్ కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని వర్షాకాల సమావేశాల్లో చేపడతామని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు- సీతారామన్ చెప్పారు. 1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా



రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను. 'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ- ముందు ఉందని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి ఖతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు- కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్వయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును కచ్చితత్వం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఇంతకు ముందు తెలియజేసింది. తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలాసీతారామన్ వివరించారు. వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్ను ను కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# హోంమంత్రి కావాలని ఉంది!

- మనోగతం వెళ్లగక్కిన రాజగోపాల్‌రెడ్డి
- అధిష్టానం ఆదేశాలే శిరోధార్యమని వెల్లడి
- కేబినెట్ విస్తరణపై హైకమాండ్ చర్చ
- ఇద్దరు మంత్రులకు ఉద్వాసన తప్పదా?

బ్యూరోఛీఫ్ - నీలగిరివార్త :
మంత్రి పదవిపై మునుగోడుఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. తనకు మంత్రి పదవి వస్తుందనే అనుకుంటున్నానన్నారు. సోమవారం ఢిల్లీలో సీరియస్ గానే కేబినెట్ విస్తరణపై చర్చ జరిగినట్లు సమాచారం ఉందన్నారు. ఐతే తనకు ఇప్పటి వరకు ఢిల్లీ నుంచి ఫోన్ రాలేదన్నారు. కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని హైకమాండ్‌ను కోరారు. భువనగిరి ఎంపీ ఎన్నికల భాధ్యతలు ఇస్తే సమర్ధవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. హోంమంత్రి పదవి తనకు ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్ధవంతంగా నిర్వహిస్తానని ప్రజల పక్షాన నిలబడతానని అన్నారు.

**కేబినెట్ విస్తరణపై హైకమాండ్ ఫోకస్!**



తెలంగాణలో కేబినెట్ విస్తరణపై హైకమాండ్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో కీలక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు నిన్న ఢిల్లీకి వెళ్లడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. మంత్రి వర్గ విస్తరణపై వీరు ప్రధానంగా హైకమాండ్ పెద్దలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమన్న ప్రచారంసాగుతోంది. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కూడా కేబినెట్లో తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

**ఇద్దరు మంత్రులకు ఉద్వాసన**

అయితే కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి తప్పించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. జూపల్లి కృష్ణారావు స్థానంలో అదే వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేమ్ సాగర్ రావును తీసుకుంటారని సమాచారం. విజయశాంతి పేరును కూడా హైకమాండ్ పరిశీలిస్తున్నట్లు గాంధీభవన్ లో చర్చ సాగుతోంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ కు కూడా కేబినెట్ బెర్త్ ఖరారైనట్లు తెలుస్తోంది. మరో ఒకటి లేదా రెండు రోజుల్లో ఈ అంశంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# పిరాయింపులకు ఏడాది పూర్తి!

మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు. స్పీకర్ క్వాషి జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షణకు కట్టు-బడి ఉండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ... తగిన సమ-యం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు-పడిందని ఆర్యామ సుందరం వెల్లడించారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు- సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియగా.. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

## కార్డుల కథ కంచికే?

మొదటిపేజీ తరువాయి..

గడిచింది. దీనిపై అడుగు ముందుకు పడలేదు. కనీ సంచర్చ లేదు.ఎక్కడా కార్యాచరణ కానరావడం లేదు.

**రేషన్‌కార్డుల ముచ్చటే లేదు!**

ఇక నెల క్రితం.. రేషన్‌కార్డుల ముచ్చటెత్తుకున్న రేవంత్ ప్రభుత్వం ఇప్పుడా మాటే ఎత్తడం లేదు. ఆ పండుగకు ఇస్తాం.. ఈ పండుగకు ఇస్తామంటూ మె-ంత్తుకున్న మంత్రులు సైతం ముఖం చాటేశారు. ప్రతీ పథకానికి రేషన్‌కార్డు తప్పనిసరి చేసిన సర్కారు.. తాజాగా రాజీవ్ యువజన స్కీంకు కూడా రేషన్‌కార్డుతో లింకు పెట్టింది. ఇప్పటికే రేషన్‌కార్డు లేక ఉచిత విద్యుత్ స్కీం, రూ.500 గ్యాస్ పథకానికి లక్షలాది మంది ప్రజలు నోచుకోకుండా పోయారు. ఎప్పటికైనా ప్రభుత్వం రేషన్‌కార్డులు జారీ చేస్తుందని నమ్మకంతో ఉన్న ప్రజలకు నిర్వేదమే మిగులుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకున్నా.. ఇప్పటివరకు ఆ దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో కూడా సర్కారు వివరాలు చెప్పకపోవడం రేషన్‌కార్డుల జారీకి సర్కారు విముఖంగా ఉన్నట్లుగా అర్థమవుతోంది.

**అటకెక్కిన గ్రామ, వార్డు సభలు..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో గ్రామాలు, వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల స్కీముల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అంతేకాదు, ఇలాంటి సభలు ప్రతీ నెలా నిర్వహిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ, ఇప్పటివరకు ఒక్క నెల కూడా సభలు నిర్వహించిన దాఖలాలు మాత్రం లేవు.

**సర్వేలు సంబరానికేనా?**

పథకాలు, పారదర్శకమైన పాలన అంటూ ప్రభుత్వం ఇప్పటికే పలు సర్వేలు నిర్వహించింది. సర్వేల ఆధారంగానే పథకాలు అమలు చేస్తామని కూడా ప్రగల్భాలు పలికింది. కానీ, సర్వేల వివరాలు బహిర్గతం చేయడంలో సర్కారు ముందుకు రాకపోవడం ఇక పథకాలు ఎలా అమలు చేస్తుందని ప్రజలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం సర్వేల ఏజెన్సీలకు ఆదాయం కట్టబెట్టడానికే సర్వేలు నిర్వహించిందని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

## ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ

మొదటిపేజీ తరువాయి..

పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్... చీఫ్ సెక్రెటరీకి ఇవే ముఖ్యం అన్నారు.. ఇక, రొటీన్‌గా ఉంటే ఏడాది అవుతుంది.. మరో నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు. ఈ



ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన... ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు-చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్‌సూన్ పోస్ట్ మాన్‌సూన్ పై దృష్టి సారించాలి.. ప్రతి జిల్లా కలెక్టరు అరకు కాఫీ పై ఫోకస్ చేయాలన్నారు.. మరోవైపు, మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.. త్వరలో విధి విధానాలు వస్తాయని తెలిపారు. 26 జిల్లాల కలెక్టర్ల పెర్ఫామెన్స్ పై సమీక్ష జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047.. వికసిత్ భారత్ పై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టారు.. అందుకు అనుగుణంగా 175 నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్‌లు ఉంటాయన్నారు.. ఎమ్మెల్యే ఆ నియోజకవర్గానికి చైర్మన్ గా ఉంటారని తెలిపారు సీఎం చంద్రబాబు.. గత పాలనతో విసిగి మాకు విస్తృత మద్దతు ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే ప్రక్రియ చేపట్టాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందాలని అన్నారు. మే నెలలో తల్లికి వందనం పథకం ప్రారంభిస్తాం. రూ.15 వేల చొప్పున.. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాఠశాలలు తెరిచేలోగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తాం. అయోమయంలో పడేసిన పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తాం. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి సంస్థల నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నాం. ల్యాండ్ మానిటైజేషన్ ద్వారా ఈ అప్పులు తీర్చేస్తామని అన్నారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు చేరాల్సిందే. జీఎస్‌డీపీ, జీవీఏలతో పాటు- తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెంచాలి. వచ్చే ఏడాదికి 15 శాతం ప్లస్ జీఎస్‌డీపీ సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలి. వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్

**తప్పుడు లెక్కలపై నిలదీత**



**హైదరాబాద్- నీలగిరివార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర అన్నీ తప్పుడు లెక్కలే ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలపై అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## రెండు పెండింగ్!

మొదటిపేజీ తరువాయి..

అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం-అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

## సొరంగంలో మరో శవం

మొదటిపేజీ తరువాయి..

కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్


మొదటిపేజీ తరువాయి..

సమయంలో కాల్పులు జరిపారు. మావోయిస్టులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు- పోలీసులు తెలిపారు. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు.కాగా, ఈ నెల 20వ తేదీన బీజాపూర్, కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## జమిలి ఎన్నికల జేపీసీ గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి..

సభ్యుని కమిటీలో చేరుస్తున్నట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలియజేశారు. రాజ్యసభ నుంచి వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి రాజీనామాతో 39 మంది సభ్యుల కమిటీలో ఒక ఖాళీ ఏర్పడింది.జమిలి ఎన్నికలపై జెపిసిని గత శీతాకాల సమావేశాల్లో ఏర్పాటు- చేశారు. కమిటీ- కాలపరిమతి ప్రస్తుత సమావేశాల చివరి వారం మొదటి రోజున ముగియవలసి ఉన్నది. కాగా, రానున్న వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు కమిటీ గడువును సభ పొడిగించింది. 39 మంది ఎంపిలతో ఏర్పాటు చేసిన జెపిసి ఈ బిల్లును అధ్యయనం చేస్తోంది. కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. వాస్తవానికి కమిటీ- కాలపరిమితి ఏప్రిల్ 4న ముగియనున్నది. బిల్లుపై చేయవలసిన పని ఇంకా మిగిలి ఉందని అధికార వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో జెపిసి గడువు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలియజేసింది.



printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

# రంజాన్ కానుక అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్



**కూకట్ పల్లి మార్చి 25 నీలగిరి వార్త**

నడికూడ మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ముస్లిం సోదరులు అతి పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగకు తెలంగాణ ముఖ్యమంత్రి రంజాన్ కానుకలను ప్రతి ముస్లిం సోదరులకు అందజేస్తున్నారని అందులో భాగంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం సోదరులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుడ్లే మలహర్రావు, సమన్వయ సమితి నాయకులు పర్నం మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఈర్ల చిన్ని, కోడెపాక ఐలయ్య, రవీందర్ యాదవ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోలేదు అనడం సరైందికాదు..

### న్యాయస్థానంలో కౌంటర్ దాఖలు చేసిన అసెంబ్లీ సెక్రటరీ...

**కూకట్ పల్లి మార్చి 25 నీలగిరి వార్త**



చట్టం ప్రకారమే స్పీకర్ నడుచుకుంటున్నారు అని సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయింపుల కేసు విచారణ. జరిగింది.స్పీకర్ తరఫున నిన్న సాయంత్రం సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన అసెంబ్లీ సెక్రటరీ పది మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపునకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదు అని పిటిషనర్లు దురుద్దేశంగా వ్యవహరిస్తున్నారు. అన్నారు. స్పీకర్ను ఆశ్రయించిన 20 రోజులకే బీఆర్ఎస్ వాళ్ళు కోర్టును ఆశ్రయించారు. అనర్హత పిటిషన్లపై చట్టంలో పేర్కొన్న పద్ధతిని ఆయన అనుసరిస్తున్నారు అని స్పీకర్ ఉద్దేశ పూర్వకంగా ఆలస్యం చేశారనడానికి ఎలాంటి కారణాలు లేవు ఈ విషయంలో దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్లలో పస లేదని, వాటిని తిరస్కరించాలని. పార్టీ ఫిరాయింపులపై వేసిన పిటిషన్లను కొట్టివేయండి అని సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి. న్యాయస్థానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# షిరిడి సాయిబాబాను కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్న బేరి రామచందర్ యాదవ్



**శేరిలింగంపల్లి నీలగిరి వార్త**

మహారాష్ట్ర లోని శిరిడి సాయిబాబాను బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు పరిగి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బేరి రామచందర్ యాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బేరి రామచంద్ర యాదవ్ మనుమడు బేరి వేదాన్ష్ యాదవ్ పుట్టు వెంట్రుకల పూజా కార్యక్రమం కోసం శిరిడి వెళ్లడం జరిగింది. కార్యక్రమాన్ని కుటుంబ సభ్యుల మధ్య దిగ్విజయంగా పూర్తి చేసుకొని అనంతరం షిరిడి సాయిని దేశ ప్రజలందరూ బాగుండాలని ఎండలు అధికంగా ఉన్నాయి కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకొని బయటకు వెళ్లాలని సూచించారు. ఈ వేసవి కాలంలో నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని మరియు నీటిని అధికంగా తాగుతూ నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలని అన్నారు. ఆ శిరిడి సాయి కరుణ కృపాకటాక్షాలు దేశ ప్రజలందరి పైన ఉండాలని కోరుకున్నారు.

# 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఘట్కేసర్ ఫ్లై ఓవర్.. ఎట్టకేలకు నిధులు మంజూరు

**శేరిలింగంపల్లి. నీలగిరి వార్త**



గత 14 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్ ఫ్లై ఓవర్ పనులు ఇకపై శరవేగంగా ముందుకు సాగనున్నాయి. అయితే, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మంగళవారం ఉదయం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్బంగా 14 ఏళుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్ ఫ్లైఓవర్ పనులను ప్రారంభించాలని డిప్యూటీ సీఎంకు మాజీ మంత్రి మల్లారెడ్డి వినతిపత్రం సమర్పించారు. అయితే, మల్లారెడ్డి వినతిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పనులు ప్రారంభించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# "జేఎన్టీయూహెచ్‌లో వైస్-చాన్సలర్ ట్రోఫీ - క్రీడా స్ఫూర్తికి నూతన హరివిల్లు"

హైదరాబాద్, మార్చి 26, 2025:
జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం

**శేరిలింగంపల్లి. నీలగిరి వార్త**

(జేఎన్టీయూహెచ్), కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో మార్చి 25 %జ% 26, 2025 తేదీలలో వైస్-చాన్సలర్ ట్రోఫీ అంతర్-కళాశాల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జేఎన్టీయూహెచ్ అనుబంధ స్వయం ప్రతిపత్తి కళాశాలల నుండి పురుషులు, మహిళల కబడ్డీ, ఖోఖో జట్లు ఉత్సాహ పూర్వకంగా పాల్గొన్నాయి. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని, జట్టు భావాన్ని, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి.

**వైస్-చాన్సలర్ చేతుల మీదుగా క్రీడా పోటీల ఆరంభం**

ఈ సందర్భంగా, జేఎన్టీయూహెచ్ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి విశ్వవిద్యాలయ ఇండోర్ స్టేడియంలో పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, "క్రీడలు నా బాల్యాన్ని గుర్తు చేశాయి" అంటూ తన విద్యార్థి దశ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అలాగే, "గెలుపు ముఖ్యం కాదుబీ పాల్గొనడమే గెలుపుతో సమానం" అంటూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇచ్చారు. విద్యతో పాటు క్రీడలు కీలక భూమికను పోషిస్తాయని, జేఎన్టీయూహెచ్ నుండి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే ప్రతిభావంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్, సీనియర్ ప్రొఫెసర్



బాలు నాయక్, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ బి. కైలాష్ యాదవ్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్, తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డి. సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**భవిష్యత్తు క్రీడా పోటీలకు ప్రోత్సాహం**

పోటీలు విద్యార్థులకు గొప్ప ప్రేరణగా నిలిచాయి. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని విశ్వవిద్యాలయం ఆకాంక్షించింది. విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తూ, క్రీడా అభివృద్ధికి విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేసింది.

# న్యాయవాదిని అతి దారుణంగా చంపడం హేయమైన చర్య

### చంపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

### బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఎర్రబాపు ఇస్రాయల్ ను హైదరాబాద్ నగరంలోని చంపాపేట్ ప్రాంతంలో సోమవారం పట్టపగలు నడిరోడ్డుపై దస్తగిరి అనే వ్యక్తి కత్తులతో అతి దారుణంగా పొడిచి చంపడానికి నిరసిస్తూ వేములవాడ కోర్టు విధులను బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం తెలిపారు. మంగళవారం హత్యకు నిరసనగా కోర్టు ప్రధాన ద్వారం ముందు న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపిన అనంతరం సదానందం మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైం దని న్యాయస్థానాలలో కక్షిదారుల కొరకు నిరంతరం పోరాటం చేస్తున్న న్యాయవాదులను చంపడం హేయమైన చర్య అని న్యాయవాదిని అతి దారుణంగా పొట్టన పెట్టుకున్న



దస్తగిరి పై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని వెంటనే అమల్లోకి తీసుకువచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్ రేగుల దేవేందర్ విద్యాసాగర్ రావు పొత్తూరు అనిల్ కుమార్ పిట్టల మనోహర్ పెంట రాజు పురుషోత్తం గోపికృష్ణ ప్రతాప సంతోష్ గడ్డం సత్యనారాయణరెడ్డి గోగికారి శ్రీనివాస్ గొంటి శంకర్ కటకం జనార్దన్ రేగుల రాజకుమార్ గుజ్జే మనోహర్ పంపరి శంకరయ్య అనిల్ వడ్ల కొండ శ్రీకాంత్ కనికరపు శ్రీనివాస్ హరీష్ నాగేంద్రబాబు మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ

### బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోతరాజు గంగరాజు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను చందుర్తి మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు నిశాంత్ కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మంగళవారం రోజు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మల్యాల గ్రామానికి చెందిన నాయకులు ఈర్లపల్లి రాజు బుర్ర లక్ష్మి నారాయణ అబ్రహం శ్రీనివాస్ శంకర్ శేఖర్ వేణు నరేశ్ క్రాంతి దేవాలింగు హన్మాండ్లు చందుర్తి మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య సీనియర్ నాయకులు చిలుక పెంటయ్య



దప్పుల అశోక్ బైరగోని రమేష్ ఏనుగుల శ్రీనివాస్ తిప్పని శ్రీనివాస్ బత్తుల కమలాకర్ దుమ్మ ఆనంద్ నగేష్, గుడిసె రమేష్ తదితరులు ఉన్నారు.

# దొంగతనం కేసులో నిందితునికి 03 సంవత్సరాల జైలు శిక్ష మరియు 6000/- రూపాయలు జరిమానా

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు .జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పుడూర్ గ్రామానికి చెందిన ఎమ్ ఎల్ నారాయణ తండ్రి అంజయ్య 50 సం. వేములవాడ ఆర్టీసీ బస్ డిపో ఏడిసి గా పని చేస్తుండగా రోహిత్ బాబూలాల్ కాలే తండ్రి ప్రకాష్ కాలే 27 సంవత్సరాలు గ్రామం సూర్య నగర్ కాలనీ మచ్చ బొల్లారం అల్వాల్ అనే వ్యక్తి నారాయణ మోసం చేసి 50,000/- రూపాయల దొంగతనంనకు పాల్పడగా నారాయణ తేదీ. 28.10.2023 కేసులో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితున్నీ రిమాండ్ కి తరలించడం జరిగింది విచారణ అనంతరం విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను



ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగ పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నింధితునికి 3 సంవత్సరంల కారాగార జైలు శిక్షతో పాటు 6000/- రూపాయలు జరిమానా విదించడం జరిగిందని పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- టిఎన్ఎస్ఎఫ్ మోడల్ ఎంసెట్,నీట్ ఎంట్రెన్స్ విజేతలకు బహుమతుల ప్రదానం..
- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సుందర్: నీలగిరి వార్త:**

తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్ మరియు వి.ఆర్.కె అకాడమీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన టి ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వాటిని సాధించుకోవడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. నిరాశ దరిచేర





కూడదని కష్టపడితే ఎంతటి విజయమైన దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ పెరిగిపోయిందని ఆ పోటీలో నిలబడాలంటే సరియైన శిక్షణ అవసరమని సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ జైపాల్ రెడ్డి కి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కృతజతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్కే విద్యాసంస్థల సీఈవో డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి సహకరించామని అన్నారు. విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంస ప్రశంస పత్రాలతో అభినందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో విఆర్ కె అకాడమి ప్రోగ్రాం ఇన్చార్జి జలిగామ శ్రీకాంత్,సమన్వయ కర్త నవీన్,ఎస్ఆర్ కె ప్రిన్సిపాల్ దత్తాద్రి,జూనియర్ ప్రిన్సిపాల్ నరేష్ అధ్యాపక బృందం శంకర్,మల్లేష్,ధర్మపురి,శేఖర్,రంగనాయకులు,మహేష్, మహేందర్,మధు,నవీన్ లు పాల్గొనడం జరిగింది.

# ఎంఎంటిఎస్ ట్రైన్‌లో యువతిపై త్యాచారయత్నం.. నిందితుడి గుర్తింపు...

**కూకట్ పల్లి మార్చి 25 నీలగిరి వార్త**



ఎంఎంటీఎస్ రైలులో నిన్న యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించిన క్రైమ్ పోలీసులు మేడ్చల్ జిల్లా గౌడవల్లి గ్రామానికి చెందిన మహేశ్ గా గుర్తింపు.జంగం మహేశ్ ఫొటోను బాధితురాలికి చూపించడంతో తనపై లైం గిక దాడికి యత్నించింది అతడేనని గుర్తించిన యువతి దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీ సులు. మిగతా ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# క్రికెట్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలి

**కూకట్ పల్లి మార్చి 25 నీలగిరి వార్త**



మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లిలో క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గుండ్ల పోచంపల్లికి చెందిన సోమేశ్ (29) అనే యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లో రూ.2 లక్షలు పోగొట్టుకొని మనోవేదనకు గురైన సోమేశ్ దీంతో గౌడవెల్లి పరిధిలో రైలు పట్టాలపై పడుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డట్టు స్థానికులు పోలీసులకు తెలిపారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

# విధులను బహిష్కరిస్తూ జిల్లా కోర్టు బయట నిరసన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సుందర్: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లాకోర్టులో కోలా శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన మంగళ వారం రోజున సమావేశం ఏర్పాటు చేసి రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ, విధులను బహిష్కరించడం జరిగింది . అలాగే ఈ మధ్యకాలంలో న్యాయవాదుల పైన జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కోర్టు బయట నిరసన తెలియజేయడం జరిగింది. మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి తక్షణమే అమలు చేయవలసిందిగా కోరుతూ ప్రతి సభ్యుడు పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించడం జరిగింది.

# కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షునిగా పెన్సిల్వారు శ్రీకాంత్



**నీలగిరి వార్త జిల్లా ప్రతినిధి సుందర్:-**

కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘము అధ్యక్షులు మొగిల్లిపల్లి భూమేష్ గుప్తా కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘము అధ్యక్షులుగా పెన్సిల్వర్ శ్రీకాంత్ గుప్తని నియమించి నియామక పత్రాన్ని వారికి అందజేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్త , నరహరి , వలపిశెట్టి లక్ష్మి రాజం , కోశాధికారి రాజేందర్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ , అడ్మిస్ట్రేటివ్ వైస్ ప్రసిడెంట్ గరిపల్లి శ్రీధర్ , కార్యదర్శి కోడిశాల శివ మరియు ఆర్యవైశ్య సంఘము నాయకులు మరియు మిత్రులు పాల్గొన్నారు.

# అగ్రహారం డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జాతీయ సదస్సు



**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బహుభాషావేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ డాక్టర్ దాశరథి పురస్కార గ్రహీత ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథ%శీ% సాహిత్యం పై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సుందర్: నీలగిరి వార్త:**
ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. క్రింద చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31 తో ముగిస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సి.హెచ్. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వెనుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసిన చల్లా లక్ష్మీకాంత్



**నీలగిరి వార్త, సూర్యాపేట:-**
రంజాన్ పర్వదినం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని పదిమంది నిరుపేద ముస్లింలకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి, సామాజిక సేవాతత్పరులు చల్లా లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా చల్లా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుండి రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు తనవంతు సహాయంగా రంజాన్ తోఫా (నిత్యావసర వస్తువులు) ఇస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ ఇసి మెంబర్ రాచకొండ శ్రీనివాస్, తెరటపల్లి సతీష్, జానకిరాములు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి.



**నీలగిరి వార్త, కొండమల్లేపల్లి:**
కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో దేవరకొండ నియోజకవర్గం శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ గారి సూచనల మేరకు సోమవారం ఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుంచి సుమారు 30 లక్షల రూపాయలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ముఖ్య అతిథిగా విచ్చేసి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుండాల కాశయ్య, దాసరి కేశవులు, యాదయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, సంధ్య, జాన్వీ, వెంకటమ్మ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**గట్టుపల్, నీలగిరి వార్తా ప్రతినిధి మార్చి 25:**
ప్రభుత్వం నుండి మండల వ్యాప్తంగా మంజూరైన 46 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు కార్యక్రమంలో తహసిల్దార్ రాములు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నామని జగన్నాథం, ఉపాధ్యక్షులు రావుల రమేష్, నియోజకవర్గ నాయకులు కంచుకట్లసంపత్, చెరిపెల్లి సత్యనారాయణ,సామల యాదయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## పర్మిషన్ వడ్డేపల్లి తవ్వకాలు దామెరలో



**నాంపల్లి నీలగిరి వార్త మార్చి 25:**
మండలంలోని వడ్డేపల్లి గ్రామపంచాయతీ పర్మిషన్తో 342 సర్వే నెంబర్ నంలో దామెర చివరు పలుగురాయి తవ్వకాలు ఫుల్లుగా ఆక్రమా రవాణా పలుగు రాయితరలింపు జరుగుతున్నాయిఅనుమతులు మించితవ్వకాలు అడిగినవారికి పర్మిషన్ ఉందనిచూపిస్తూ గతంలో నిలిపివేసినప్పటికీ తవ్వకాలుపగలురాత్రి తేడా లేకుండాతరలిస్తున్నారుఇట్టి తవ్వకాలపై ఉన్నత అధికారులు చర్యలుతీసుకోవాలని స్థానికులుకోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సభకి ముమ్మర ఏర్పాట్లు

### సభా స్థలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.





**నీలగిరి వార్త, హుజూర్ నగర్**
సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఉగాది పర్వదినాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజర్ నగర్ పట్టణంలో ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను జిల్లా ఎస్పి నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సభా జరిగే ప్రాంగణం పరిశీలిస్తూ హెలిప్యాడ్ దిగే వద్ద విద్యుత్ స్తంభాలు తొలగించి ఆ లైన్లో ఉన్నా విద్యుత్ సరఫరాను వేరే రూట్లో సరఫరా చేయాలని,హెలిప్యాడ్ నుండి సభా వేదిక వరకు అప్రోచ్ రోడ్డును వేయాలని, బారికేడ్లు నిర్మించాలని తెలిపారు.విఐపి,అధికారుల పార్కింగ్ లను పరిశీలించారు.

హెలిప్యాడ్ను,అప్రోచ్ రోడ్లు 27వ, తారీఖు సాయంత్రంలోపు పూర్తి చేయాలని తెలిపారు.ప్రజలు ఎక్కువగా వస్తారు కాబట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా పలు చోట్ల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.పార్కింగ్ స్థలాలకి వెళ్లే రోడ్లలో గుంటలు పూడ్చి,రోలింగ్ ద్వారా చదును చేయాలని,దారి పొడువునా ఏమైనా చెట్ల కొమ్మలు అడ్డు వస్తే తొలగించాలని,పార్కింగ్లో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి పార్కింగ్లో రెండు దారులు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్కి సూచించారు. అనంతరం హుజూర్ నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్,పార్కింగ్,వి ఐ పి లకు ప్రోటోకాల్,సభవేదిక వద్ద తహసీల్దార్ లకి ఇంచార్జి విధులు కేటాయించామని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఎండకాలం కాబట్టి ప్రజలకోసం చల్లని త్రాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలని ప్రతి సెక్టార్ కి ఎంపిడిఓ, ఎంపిఓ ఇంచార్జిగా ఉంటూ పంచాయతీ సెక్రటరీలను సపోర్ట్గా ఉంచుకుంటూ గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో సభకు వచ్చిన ప్రజలకి త్రాగునీరు,మజ్జిగ అందజేయాలని తెలిపారు.అధికారులు ఐడి కార్డులు ధరించాలని అన్నారు.సమాచార శాఖ ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు శ్రీనివాసులు,సూర్యనారాయణ, తహసీల్దార్లు నాగార్జున రెడ్డి,కమలాకర్, మంగా,జ్యోతి, కవిత ,సైదులు,సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 27న మక్కా మస్జీద్ లో షబ్ ఏ ఖదర్

**దేవరకొండ నీలగిరి వార్త**



27న దేవరకొండ పట్టణం లోని స్థానిక మక్కా మస్జీద్లో షబ్ ఏ ఖదర్ నిర్వహిస్తున్నట్లు ఈద్గా %ల% మక్కా మస్జీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమొద్దీన్ పేర్కొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27 న గురువారం షబ్ ఏ ఖదర్ కు మక్కా మస్జీద్ లో పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయని, మస్జీద్ లో జాగారం ఉంటుందన్నారు, ఆ తర్వాత రాత్రి 1 గంట వరకు పలువురు ముఖ్య అతిథులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. షబ్ ఏ ఖదర్ సందర్భంగా మక్కా మస్జీద్ కు ముఖ్య అతిథిగా నల్లగొండ జిల్లా తబ్లిఖి జమాత్ కన్వీనర్ మహ్మద్ అన్వరొద్దీన్ విచ్చేస్తున్నారని తెలిపారు. అనంతరం తెల్లవారు జామున మూడు గంటలకు తమ తమ కుటుంబాల్లో మరణించిన వారి సమాధుల వద్ద ముస్లిం సోదరులు దువా చేస్తారని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కమిటీ గౌరవ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఎండి ఇలియాస్ పటేల్, ఉపాధ్యక్షులు మహ్మద్ ఖదీర్ (సాలర్ ), మహ్మద్ షబ్బీర్, సభ్యులు ఎండి సలీమ్, సయ్యద్ దస్తగిర్, ఎస్ కె బురాన్, ఎండి ముజీబ్, సయ్యద్ అజీజ్, ఎండి ఖాజా మైనొద్దీన్, మహ్మద్ అఫ్రోజ్, ఎస్ కె ఇల్యాస్ బాబా, మహ్మద్ జాఫర్, మహ్మద్ ఖైసర్, మహ్మద్ షకీల్, సయ్యద్ హమీద్, సయ్యద్ మంజూర్, మహ్మద్ షఫీ, మహ్మద్ ఇస్మాయిల్, ఎస్ కె అంజద్, బారి, షేహభాజ్ తదితరులు పాల్గొన్నారు

## బ్రాహ్మణ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం

**పంచాంగాన్ని ఆవిష్కరించిన దేరం భాస్కర శర్మ**
**రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ అభ్యుదయ సంఘం గౌరవ అధ్యక్షులు**
**బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం 51 వేల రూపాయల విరాళం**
**ఘనంగా పంచాంగం ఆవిష్కరణ**





**దేవరకొండ నీలగిరి వార్త**
బ్రాహ్మణ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ అభ్యుదయ సంఘం గౌరవ అధ్యక్షులు దేరం భాస్కర శర్మ అన్నారు. మంగళవారం బ్రాహ్మణ దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో నూతన సంవత్సర ఉగాది పంచాంగాన్ని స్థానిక కోదండ రామాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బ్రాహ్మణ నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు కురుమేటి రవి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దినదిన పరివర్తమానంగా 15 సంవత్సరాలుగా పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాలు దేవరకొండ లో నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారని తెలిపారు. బ్రాహ్మణ సంఘ భవనముకు తనవంతుగా ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ఒక తాటిపై నిలిచి స్థానిక ఎమ్మెల్యే ద్వారా భవన నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వంశీకృష్ణ శర్మ గౌరవ అధ్యక్షులు సురభి కృష్ణమూర్తి శర్మ, కుర్మేటి రవి ప్రసాద్ శర్మ, అధ్యక్షులు కార్యా నిర్వహణ అధ్యక్షులు జి.భాస్కర శర్మ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి గాదె కిషోర్ శర్మ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర శర్మ, సాయి విశ్వనాథ శర్మ, ఉప కోశాధికారి శ్రీనివాస శర్మ, సహాయ కార్యదర్శి గంప శశి కుమార్, ప్రచార కార్యదర్శి కే ఉమాశంకర్ శ్రీకాంత్ శర్మ, సాంస్కృతిక కార్యదర్శి సుబ్బయ్య శర్మ, మీడియా కార్యదర్శి గాదె గిరిధర్ రావు, ఈటూరి రజనీకాంత్ ,కార్యవర్గ సభ్యులు దేరం జయప్రకాష్ శర్మ, సతీష్ శర్మ, చింతలపల్లి వెంకటేశ్వర శర్మ, చెరుకుపల్లి శ్రీనివాస్ శర్మ, పవన్ శర్మ, సురభి ప్రభాకర శర్మ, చెరుకుపల్లి అజయ్ శర్మ వైద్యల ప్రవీణ్ కుమార్ శర్మ, తదితర బ్రాహ్మణ కార్యవర్గ సభ్యులు పెద్దలు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి





**ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి,**
**మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



నీలగిరి వార్త, సూర్యాపేట:-
ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. రంజాన్ పండుగను ప్రపంచవ్యాప్తంగా వున్న ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని, ఈ రంజాన్ మాసంలో నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. రంజాన్ పర్వదినం ఉపవాస దీక్షల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం నాడు స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్ నందు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లా దయతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని అన్నారు. హిందూ ముస్లిం లు ఐకమత్యంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం తెలంగాణ సాంప్రదాయమని అన్నారు. ఈ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లిం లకు సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి, పిసిసి అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, నాయకులు చింతమల్ల రమేష్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పోలగాని బాలు, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, కరిముల్లా బేగ్, రుద్రంగి రవి, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం :ఎస్సై బొజ్జ మహేష్ కుమార్



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-**
ఎల్లారెడ్డి మండల కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా మెస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్న ఆశీర్వాదం గత రెండు నెలల క్రితం పని మీద చెన్నై వెళ్లి అప్పుడప్పుడు ఇంటికి వస్తూ వెళ్తున్నాడు. ఈ నెల తేదీ 19వ తారీఖు నాడు ఆశీర్వాదం తన భార్య అయిన రాజేశ్వర్కి ఫోన్ చేయగా బిజీ రావడంతో ఎం దుకు బిజీ వస్తుందంటూ మందలించినాడు తేదీ 20వ తారీకు నాడు ఇంటికి వచ్చి చూడగా ఎల్లారెడ్డి నందు తన ఇంట్లో తన భార్య కనిపించలేదు ఇట్టి విషయమై ఇంటి ఓనర్ ఉండదుగా ఆమె ఎక్కడికో చెప్పకుండా వెళ్ళిపోయింది అని తెలపడంతో ఇట్టి విషయమే ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ నందు ఆశీర్వాదం ఫిర్యాదు కేసు నమోదు చేసి చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సుందర్: నీలగిరి వార్త:**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నందు ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ నందు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు కోర్సు పూర్తి చేసుకుని కళాశాలను వీడుతున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు కాలేజీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. శోభారాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తి లాంటి వారని, కళాశాల పేరును నిలబెట్టేవారని తెలిపారు విద్యార్థులు ప్రతికూలతలను అనుకూలతలుగా మలచుకొని లక్ష్యం దిశగా ప్రయాణించాలని ఆకాంక్షించారు. ఆద్యంతం భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ సీ హెచ్.మీన, డా. డి.శ్రావణి, అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్యాలతో సందడి చేసారు.

## వ్యక్తి కనబడుటలేదు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



క్రింది ఫోటోలో ఉన్న వ్యక్తి పేరు షేక్ వజీర్, తండ్రి పేరు కాసింసాబ్, వయసు 54 సంవత్సరాలు, వృత్తి డ్రైవర్, నివాసము తాందూరు గ్రామము, వికారాబాద్ జిల్లా.. ఇట్టి వ్యక్తి ఈరోజు తేది 25/03/2025 నాటి ఉదయం సమయం 6:30లకు కామారెడ్డి డీసెంట్ లాడ్జి వద్ద నుండి బయటకు వెళ్ళొస్తానని చెప్పి వెళ్లిపోయినాడు.. ఇతనికి కల్లు తాగే అలవాటు ఉన్నందున, ఎక్కడైనా కామారెడ్డి పట్టణంలో కల్లు తాగి గానీ లేదా మరేదైనా కారణంతో గానీ బయటకు వెళ్లి ఉండవచ్చని, అడ్రస్ తెలియకపోవడం వల్ల తప్పిపోయినాడని అతనితో పాటుగా ఇక్కడకు వచ్చిన బాలాసాహెబ్ తప్పిపోయిన వ్యక్తి గురించి చుట్టుపక్కల వెతికి, పీఎస్ కి వచ్చి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేయడం జరిగింది.. ఈ వ్యక్తి ఎక్కడైనా కనబడినట్లయితే వెంటనే కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో సీఐ కామారెడ్డి టౌన్ 8712686145 8712666242 నంబర్లకు తెలియపరచగలరు.

## పలు కార్యక్రమాలకు హాజరైన మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండల తుక్కోజివాడి గ్రామ బి.ఆర్.ఎస్ నాయకుడు రాజు ఆహ్వానం మేరకు వారి పిల్లల ఒళ్లెల ఫంక్షన్కి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గారి వెంట మండల నాయకులు, ప్రజా ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## బస్ స్టాండ్ వద్ద ప్రయాణికులకు పోలీసుల అవగాహన కార్యక్రమం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సుందర్: నీలగిరి వార్త:**
కామారెడ్డి పట్టణంలో మంగళవారం రోజున నిజాంసాగర్ చౌరస్తా సమీపంలో ఉన్న బస్ స్టాండ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది.ఇందులో భాగంగా బస్ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రయాణం చేయునపుడు చుట్టూ ఉన్నవారిని గమనిస్తూ, అనుమానాస్పదంగా కన్పించిన వారి గురించి పోలీస్ వారికి తెలియచేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## అన్నదానానికి విరాళం



భద్రాచలం టౌన్ నీలగిరి వార్త

జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరానికి మంగళవారం నాడు 25వేల రూపాయలు విరాళం అందినది. మల్లాది వెంకట రామారావు జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు 25వేల రూపాయల విరాళాన్ని ఆలయ నూతన అధ్యక్ష కార్యదర్శులు కొమ్మనాపల్లి ఆదినారాయణ, అబ్బినేని శ్రీనివాస్ రావు లకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను శాలువాతో సత్కరించి బాబా వారి మెమెంటోను అందజేశారు. అర్చకులు వారి పేరుతో గోత్రనామాలతో అర్చన జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జువినైల్ వెల్ఫేర్ కరక్షన్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్‌లో మెడికల్ క్యాంపు


### యు.ఎఫ్ డబ్ల్యు.సి ఎం.జి.ఎం హాస్పిటల్ డాక్టర్.ఎం.యశస్విని



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీ.పీ యూనిట్) వారి ఆధ్వర్యంలో వరంగల్ ఆటోనగర్ లోని జువెనైల్ వెల్ఫేర్ కరెక్షన్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ లో మెడికల్ క్యాంపు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేసిన డాక్టర్.ఎం.యశస్విని. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్.ఎం.యశస్విని విద్యార్థులందరికి మెడికల్ చెకప్ చేశారు. డాక్టర్ యశస్విని మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి, వేడి ఆహారం తీసుకోవాలని, ముఖ్యంగా గుడ్లు, పాలు, బ్రెడ్ మొదలైనవి తీసుకుంటే ఆరోగ్యం ఉంటుందని స్టూడెంట్స్ కు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సూపరిడెంట్ శ్రీదేవి, ఎం.జి.ఎం. (పీ.పీ యూనిట్) హెచ్.వీ.నర్మద, రామ రాజేష్ ఖన్నా, ఆశా కార్యకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ డ్రగ్ వేర్ హౌస్‌ను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ పట్టణంలోని రంగశాయిపేట యూపీహెచ్ సి ప్రాంగణంలో గల కేంద్ర ఔషధ గిడ్డంగి (సెంట్రల్ డ్రగ్ వేర్ హౌస్) ను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఔషధాల స్టాక్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనధికారికంగా విధులకు గైరుహజరైన సూపర్వైజర్ నాగమణి ను, విధులు సక్రమంగా నిర్వహించని ప్యాకర్ చక్రపాణి లకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టిజిఎంఐడిసి ను కలెక్టర్ చారవాణి లో ఆదేశించారు. కలెక్టర్ వెంట వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, యూపీహెచ్ సి. మెడికల్ ఆఫీసర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మరణ వార్త తెలుసుకొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మన్యం సిద్దయ్య భార్య మన్యం మహేశ్వరి మరణ వార్త తెలుసుకొని. వారి గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన. గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి.

## ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెంచే విధంగా నిజాయితీగా పనిచేయాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

పోలీసుల గౌరవ మర్యాదలు పెంపోందించే విధంగా నిజాయితీగా పోలీస్ అధికారులు పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం తొలిసారి అత్మకూర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు సిసి కెమెరాల కంట్రోల్ రూంలోని సిసి కెమెరాల పనితీరు, స్టేషన్‌లోని వివిధ రికార్డు గదులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, స్టేషన్ పనితీరుతో పాటు ,స్టేషన్ పరిధిలో ఏలాంటి నేరాలు జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు, రోజు ప్రమాదాల సంఖ్య, పోలీస్ స్టేషన్ పరిధి, స్టేషన్ సిబ్బంది మొదల్కెన వివరాలను ఇన్స్‌స్పెక్టర్ సంతోష్‌ను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నిజాయితీ పనిచేయాలని, ఫిర్యాదులుపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ భూపాలపట్నం ప్రధాన రోడ్డు మార్గం వుండటం ద్వారా ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా వుండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏసిపి సతీష్‌బాబు పాల్గొన్నారు. కంఠాత్మకూర్‌లో పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సిపి అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ డిసిపి అంకిత్‌కుమార్‌తో కల్సి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో విధులు సిబ్బంది వివారాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, రోజు మొత్తం మీద ఎన్ని వాహనాలు తనిఖీ చేస్తారు. అలాగే అనుమతులు వున్న ఇసుక వాహనాలను ఏవిధంగా తనిఖీలు నిర్వహిస్తారని చెక్‌పోస్ట్ సిబ్బంది పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెక్‌పోస్టు సిబ్బంది తనిఖీ తీరును సిపి ఎదుట ప్రత్యక్షంగా ప్రదర్శించారు.



## దామెర పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ దామెర పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు పోలీస్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, పోలీస్ కమిషనర్ పరిశీలించడం, స్టేషన్ నందు విధులు సిబ్బంది వివరాలతో పాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ఎలాంటి నేరాలకు సంబంధించి కేసులు నమోదవుతాయని, ఎలాంటి గోడవలు అధికంగా జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు, వారిని ఎలా వారిని తనిఖీ చేసారు, అలాగే స్టేషన్ అధికారి రోజువారి వివరాలను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నెలకోసారి తప్పనిసరిగా స్టేషన్ అధికారి తప్పని సరిగా రౌడీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై చుట్టు ప్రక్కల వారిని ద్వారా అరా తీయాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యారుదలపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారికి సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్, ఏఎస్పీ ప్రస్తుతం దామెర స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఏ.ఏస్పీ మనన్‌భట్, పరకాల ఏసిపి సతీష్‌బాబు వున్నారు.

## భరోసా షీ టీం కేంద్రాలను సందర్శించిన క్రైమ్స్ డిసిపి



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డిసిపిగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బి జనార్ధన్ మంగళవారం రంగం పేటలోని భరోసా మరియు షీ టీం కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సువర్ణ, సుజాతలు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం లైంగిక దాడులకు గురైన మహిళలు బాలికలు యువతలకు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను రెస్పెక్టర్ సువర్ణ డిసిపికి వివరించారు. అలాగే షీ టీం పనితీరు తో పాటు మహిళల భద్రత కోసం తీసుకున్న చర్యలు అలాగే చర్యలపై ప్రజలకు అవగాహన కోసం చేపడుతున్న కార్యక్రమాలపై ఇన్స్ స్పెక్టర్ సుజాత డిసిపికి వివరించారు.

## చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి విజయవతం



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షులు కొరివి పరమేష్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా యువతపై చూపిస్తున్న నిర్లక్ష్యానికి, రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగ సమస్యకి నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చీబ్ అధ్యక్షతన మంగళవారం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ సమస్యను తరిమికొట్టి, విద్యకు పెద్దపీట వేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య.
- రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళాను ను రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జిల్లా కలెక్టర్ కుడా చైర్మెన్ తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్సీ.
- నేటి నుండి మూడు రోజుల పాటు కొన సాగనున్న మేళా.
- రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని ఉ ద్ఘాటించిన ఎమ్మెల్సీ.
- వివిధ జిల్లాలకు చెందిన 50 వ్యవసాయ ఉ త్పత్తుల స్టాల్స్ ఏర్పాటు.





వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

రైతులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి సభ్యులు బసవరాజు సారయ్య అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నగర 43 వ డివిజన్ రంగశాయిపేటలో మూడు రోజుల పాటు నిర్వహిస్తూన్న రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళాను ను ఎమ్మెల్సీ , రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మెన్ జంగా రాఘవరెడ్డి జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, కుడా ఛైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి లతో కలిసి ముఖ్య అతిథి గా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని, ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సి ఎం కు దక్కుతుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం లో రైతులు, మహిళలు, కార్మికులకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నవని అన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నుండి వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా బ్యాంకు లింకేజీలు, రైతులు తక్కువ పెట్టుబడితో వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అధిక రాబడి పొందే విధంగా నిష్ణాతులైన శాస్త్రవేత్తలు సాంకేతిక పరిజ్ఞానం ఈ మేళా లో అందిస్తారని, దేశంలోని చిన్న సన్నకారు రైతుల భేరసారాల శక్తిని మార్కెట్ లింకేజీని పెంచి వారిలో సాధికారత కల్పించడమే లక్ష్యంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటుచేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించి వివిధ వినూత్న వ్యవసాయ పద్ధతులను ప్రదర్శించడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ఎఫ్ పి ఓల వృద్ధి, అభివృద్ధిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని, నిష్ణాతులైన శాస్త్రవేత్తలు సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ పద్ధతులపై వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మెన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా కలెక్టర్ ల సహకారం తో రాష్ట్ర స్థాయి మేళా ను ఏర్పాటు చేయడం అభినందనీయం అని, పండించిన పంటకు గిట్టుబాటు అందించే విధంగా వివిధ వ్యవసాయ సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేసే విధంగా రైతును బలోపేతం చేయడానికి గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారని, నకిలీ విత్తనాల వల్ల మోసపోతున్నారని, ఇలా జరగకుండా రైతులను చైతన్యం చేయడానికి మేళా ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పది మంది తో సుమారు రాష్ట్ర వ్యాప్తం గా 10 వేల గ్రూపు లను ఏర్పాటు చేసి రైతులకు లాభం చేకూరే విధంగా కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని అన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు వివిధ పంటలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని రైతు లకు అందించాలని రాష్ట్రం లో దేశం లో ఆయిల్ పామ్ పంట సాగు తక్కువ విస్తీర్ణం లో సాగు అవుతుందని ఆయిల్ సాగును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.375 కోట్లను కేటాయించిందని, ఈ పంట సాగు చేయడానికి నీటి వినియోగం ఎక్కువ అనే అపోహను రైతులు వీడనాడాలని అన్నారు. వరి పంటకు వాడే నీటి లో మూడవ వంతు నీటి ద్వారా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయవచ్చునని తెలిపారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రైతులకు లాభసాటిగా మారడంలో ఎఫ్ పీ ఓ ల పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా వరంగల్ జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళను రైతులుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సుమారు 40 ఉత్పత్తిదారుల సంఘాల యొక్క ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్, అమ్మకం నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. చిన్న సన్నకారు రైతులు వనరులను సమష్టిగా యాక్సెస్ చేసి వారి ఉత్పత్తులను, మార్కెట్ సంబంధాలను మెరుగుపరిచి ఆదాయం పెంచడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా యంత్రాంగం రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేసి, జిల్లాలో పెద్దఎత్తున రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆర్థికాభివృద్ధికి చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు ను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ లను బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలన్నారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎఫ్ పి ఓ వల్ల రైతులు సమష్టి బలం ఇన్పుట్స్ ఉత్పాదకములు పొందవచ్చని అన్నారు. సాంకేతిక శిక్షణ, మరియు రైతుల ఉత్పత్తులను సమష్టిగా మార్కెటింగ్, ప్రాసెసింగ్ ప్యాకేజింగ్ చేయడానికి సహాయపడుతుందని తెలిపారు. రైతులు (ఎఫ్ పి ఓ) రైతు ఉత్పత్తిదారుల సంస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటి ప్రయోజనాలు పొందాలని అన్నారు. మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సుమారు 40 ఎఫ్ పి ఓ లు పాల్గొని తమ ఉత్పత్తులను విక్రయిస్తూన్నారని దాదాపుగా 1000 మంది రైతులు ఈ మేళాను సందర్శించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఉత్పత్తి చేసిన గృహ, వంటగది అవసరాలు, ఆరోగ్యకర అల్పాహారాలు, అందం, ఆరోగ్య సంరక్షణ తదితర సహజ సిద్ధమైన మేలైన ఉత్పత్తులను ఆసక్తి వున్న ప్రజలు కొనుగోలు చేయుటకు, రైతు యొక్క ఉత్పాదకతను పెంచటానికి, ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానాల ద్వారా అధిక రాబడి ఆదాయమును పెంపొందించుటకు కొత్త %ఖీూ% లు ఏర్పడిన సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు %ఖీూ%ల నిర్వహణ, ఉత్పత్తి ప్రాసెసింగ్, విలువ, మార్కెట్ లింకేజీలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం మొదలైన అంశాలలో మద్దతు అందిస్తామని అన్నారు.

ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన 50 వ్యవసాయ సంబంధిత పనిముట్లు, యంత్రాలు, ఉత్పత్తుల స్టాళ్లను అతిథులు సందర్శించి యంత్రాల పనితీరు, ఉపయోగాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఏ సి డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ రామస్సింగ్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి పి జె టి ఏ యు డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ సుజాత, వ్యవసాయ అధికారి అనురాధ డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి, రెడ్ పి సి ఓ రామ్ రెడ్డి, జిల్లా ఉద్యానవనాల ఆధికారి సంగీతలక్ష్మి, మార్కెటింగ్ అధికారి సురేఖ, స్థానిక కార్పొరేటర్ ఎదూరి అరుణ విక్టర్, 33 జిల్లాల రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికై నేడు చలో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సిపిఎం పోరుబాట

**సిపిఎంపార్టీ మండలకార్యదర్శి: కామ్రేడ్ బుర్రి శ్రీరాములు**



మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మార్చి 25

మునగాల:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని రేపు 26న సిపిఎం పోరుబాట చలో కలెక్టరేట్ ముందు ధర్నాకు ప్రజల అధికసంఖ్యలో పాల్గొనలని సిపిఎం పార్టీమండలకార్యదర్శి బుర్రి శ్రీరాములు,ప్రజలకు పిలుపునిచ్చారు, మంగళవారం సిపిఎం స్థానిక సిపిఎం పార్టీ సుందరయ్య స్మారక భవనములో ముఖ్యకార్యకర్తల సమావేశం చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ, రైతులకు ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని,కొత్త రేషన్ కార్డులు ఇస్తామని,వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు ఇస్తామని, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతిసమస్యను పరిష్కరిస్తామని మాటలు చెప్పటం తప్పపరిష్కారంచూపలేదని అన్నారు. ఎస్సారెస్పీ కాలువ కింద ఎండిపోయిన పంట పొలాలను పరిశీలన చేసే ప్రయత్నం ఇంతవరకు ప్రభుత్వం చేయలేదని వెంటనే ప్రభుత్వంస్పందించి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని,ఇందిరమ్మ ఇండ్లు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఉపాధి హామీపనితో సంబంధం లేకుండా 12 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రేపు కలెక్టరేట్ ముందు జరగబోయే ధర్నాకు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీజిల్లా కమిటీసభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, మండలకమిటీ సభ్యులు బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, మామిడి గోపయ్య, వీరబోయిన వెంకన్న,ఎర్రవెల్లి ఎంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావంతో ప్రశంసలు పొందిన వర్కాల సూర్యనారాయణ




గట్టుప్పల్, నీలగిరి వార్తా ప్రతినిధి, మార్చి 25:

తాను నిరంతరం చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంసలు పొందడం సంతోష దాయకమని, ఇలాంటి సేవలను నిరంతరం కొనసాగిస్తానని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలీయుల నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు, సంఘ సేవకులు ఆధ్యాత్మివేత్త వర్కాల సూర్యనారాయణ అన్నారు. గ్లోబల్ బిజినెస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా వర్కాల సూర్యనారాయణను గ్లోబల్ బిజినెస్ నెట్వర్క్ నిర్వాహకులు కడారి శ్రీధర్ తదితరులు శాలువతో సత్కరించి షీల్డును బహూకరించారు. ఈ సందర్భంగా వర్కాల సూర్యనారాయణ మాట్లాడుతూ శ్రీశైలంలో పద్మశాలి నిత్యాన్నదాన సత్రం ద్వారా, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా విశేష సేవలందిస్తున్నామని తెలిపారు. తమ సేవలను గుర్తించి పలు సంస్థలు తమను అవార్డులతో సత్కరించారని వివరించారు. మా గ్రామంలోని కొయ్యలగూడెంలో విద్యార్థులు చదువుకునేందుకు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల ఒకే దగ్గరలో ఉండడంతో విద్యార్థులకు చానా ఇబ్బందులు అవుతున్నాయని గమనించి, విద్యార్థులు మంచిగా చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని నాకు ఉన్నటువంటి స్థలాన్ని స్కూలుకు ఇచ్చానని సందర్భంగా తెలిపారు. సేవా భావంతో పాటు, భక్తి భావాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమాజంలో ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోవాలని కోరారు.

## "రాజీవ్ యువ వికాసం పథకం"నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

**టిపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్**

వరంగల్ సిటీ నీలగిరి వార్త.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు తీపి కబురుగా శుభవార్త చెప్పింది. స్వయం ఉపాధి పథకం (సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ స్కీం) కోసం దరఖాస్తులు ప్రారంభించింది. రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన వారికి నాలుగు లక్షల రూపాయలు ఇవ్వనుంది. ఎస్సీ,ఎస్టి,బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన వారు ఈ స్కీం కోసం ఆన్లైన్ ద్వారా మార్చి 17 నుండి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని,అర్హులైన వారికి 60% నుంచి 80%శాతం సబ్సిడీ వర్తిస్తుందని టిపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ తెలిపారు ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా,ఆత్మకూరు మండలం,కందిబండ (నీరుకళ్ళ) గ్రామంలో వారి స్వహగృహంలో మాట్లాడుతూ గత బిఅర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత ను పట్టించుకున్న దాఖలాలు లేవు ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వలేదు నోటిఫికేషన్ ఇచ్చిన పేపర్ లీకేజీలు అందుకే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెతింపారని నిరుద్యోగ భృతి ఇస్తా అని మోసం చేసిందని ఎద్దేవ చేశారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వచ్చిన ఒక సంవత్సరం లో 55వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వనిది. అని గుర్తు చేసారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగ చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని. ఎస్ సి, ఎస్ టి, బి సి మైనార్టీ యువత కు. 6000కోట్లతో 5లక్షల యువత కు స్వయం ఉపాధి కల్పించాలని ఉద్దేశ్యం తో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగింది అని అన్నారు,ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చి నిరుద్యోగు ల ఆర్థిక పరిస్థితి నీ మెరుగుపరిచడానికి. ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింది. నిరుద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోగలరని అర్షం అశోక్ తెలిపారు.

## మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి,ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్ మాజీమంత్రి కేటీఆర్

**మునగాల మండల,కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి.**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మార్చి 25



మునగాల:మాజీమంత్రి, కేటీఆర్, ఒళ్ళు దగ్గర పెట్టు కుని జాగ్రత్తగా మాట్లాడాలని మునగాల మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పత్రిక ప్రకటనద్వారామాట్లాడుతూ, గురువారం నాడు,మాజీ మంత్రి కేటీఆర్,సూర్యాపేట జిల్లాకేంద్రంలో వారి పార్టీకార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రివర్యులు, మన ప్రియతమ నాయకులు, ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి గారి, పైన తప్పుడు ఆరోపణలు చేసి ప్రజల తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని నీతి నిజాయితీగా గత 30 సంవత్సరాల నుండి అవినీతి మచ్చ లేకుండా అధికారం ఉన్నా లేక లేకున్నా ఓడిపోయిన ప్రజలకోసం నియోజకవర్గాల అభివృద్ధి కోసం నిధులుతీసుకువచ్చి సీ.సీ రోడ్లు, డ్రైనేజ్ కాలువలు,ఆర్.అండ్.బి. రోడ్లు,నూతన రేషన్ కార్డులు,లిఫ్ట్ ఇరిగేషన్లు,రెసిడెన్షియల్ స్కూల్స్, విద్యా, వైద్యం,మౌలిక సదుపాయాలు తాగునీరు సాగునీరు కోసం వేలకోట్ల రూపాయలునిధులు తీసుకు వచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోఅభివృద్ధి కోసం పాటుపడుతున్న వ్యక్తులను విమర్శిస్తే బిఆర్ఎస్ నాయకులకు ప్రజలు దగ్గర గుణపాఠం చెబుతున్నారు.గెలిచిన 15 నెలల్లోనే,రెండునియోజకవర్గాలకు,కొన్ని వందల కోట్లరూపాయలు మంజూరుచేసి సీ.సీ రోడ్లు డ్రైనేజీ కాలువలు తాగునీరుసమస్యలు, నూతన ప్రభుత్వ భవనాలు, బీటీరోడ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, బ్రిడ్జిలు, మంజూరు లాంటి, పరిష్కారానికి కృషి చేసి మండలాన్ని, నియోజకవర్గన్నీ అభివృద్ధి పథంలో నడుపుతున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఉత్తమ్ పద్మావతిగార్లను, విమర్శిస్తే ఖబర్దార్ కేటీఆర్, అంటూ, మరొక్కసారి ఉత్తమ దంపతుల మీద విమర్శలు, చేసినట్లయితే, బిఆర్ఎస్ నాయకులను తరిమికొడతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కోదాడ మార్కెట్ డైరెక్టర్ కాసర్ల కోటయ్య,కాంగ్రెస్ పార్టీజిల్లా నాయకులు ఎలక నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కాలే సామేలు, మునగాల,కలకోవ, గ్రామశాఖఅధ్యక్షులు,కొమ్ము ఈదరావు, పనస శంకర్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తక్కెళ్లపాటి సాయి, చిర్రా శ్రీను, చింతకాయల నాగరాజు, సైదిరెడ్డి, మండవ శ్రీను,యువజన కాంగ్రెస్ నాయకులు, పాషా, జిల్లేపల్లి రమేష్,నవీన్ ,వీరబాబు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రైతు గ్రూపుకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్

**మహిళారైతులనుండి దరఖాస్తులు స్వీకరిస్తున్న కోదాడసహాయ వ్యవసాయసంచాలకులు డి ఎల్లయ్య**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మార్చి 25



మునగాల:ప్రత్యేకంగామునగాల మండలానికి వ్యవసాయంలో ఉపయోగించే ఒక డ్రోన్ పరికరాన్ని 5 లక్షల సబ్సిడీతో మహిళా గ్రూప్ రైతులకు అందించడానికి అనుమతి వచ్చింది. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మహిళా రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి, బ్యాంకు నుండి లోన్ తీసుకోవడం ద్వారా 5 లక్షల సబ్సిడీతో డ్రోన్ పరికరాన్ని పొందవచ్చు. ఈమహిళా గ్రూపులో కచ్చితంగా డిగ్రీ పూర్తి అయిన ఒక మహిళ ఉండిఉండాలి.కావున కావాల్సిన మహిళా రైతులు మరిన్ని వివరాలకు మండల వ్యవసాయ అధికారికార్యాలయం మునగాలలో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం. మహిళారైతులకు ట్రాక్టర్తో నడిచే పొలంలో బోదేలు,గట్లు చేసే యంత్రం 1,20,000 సబ్సిడీ తో కలదు. ఈరోజు వ్యవసాయయాంత్రీకరణ పథకంలో భాగంగా ట్రాక్టర్స్ పనిముట్లకి ఒకదరఖాస్తు పవర్స్ప్రేయర్స్లకు ఆరు దరఖాస్తులనుమండలంలో స్వీకరించడంజరిగింది. ఈ దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో కోదాడ సహాయ వ్యవసాయసంచాలకులు డి.ఎల్లయ్య, మండల వ్యవసాయ అధికారి బుంగ రాజు, వ్యవసాయవిస్తరణ అధికారులు రమ్య,భవాని, రేష్మ, నాగు,మరియు రైతులు పాల్గొన్నారు.

## 32వ డివిజన్లో వేసవికాలంలో కరెంటు కష్టాలు రాకుండ నూతన నాలుగు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు



**చేపించిన స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి**

వరంగల్ సిటీ నీలగిరి వార్త.

వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శ్రీ పల్లం పద్మ రవి గారు స్థానిక డివిజన్లో తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండ సురేఖ సహకారంతో వేసవి కాలంలో నూతనంగా నాలుగు ట్రాన్స్ఫర్ లని ఏర్పాటు చేసి కరెంటు కోతలతో ప్రజలకు ఇబ్బందులు పడకుండా ముందుగా చర్యలు తీసుకోవడం జరిగింది నూతన నాలుగు ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాట్లు భాగంగా 100 కేవీ తో కెపాసిటీ ఉన్న రెండు ట్రాన్స్ఫర్లను క160కెవి పెంచి జ్యోతి కాలనీలో ఒకటి మరియు రిలయన్స్ స్కూల్ వద్ద ఏర్పాటుచేయడానికి అదేవిధంగా 100 కేవీ రెండు నూతన ట్రాన్స్ఫార్మర్లను జేఎస్ఎమ్ స్కూల్ ఎదురుంగా అదేవిధంగా నాని గార్డెన్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీమతి శ్రీ పల్లం పద్మ రవి తో పాటు ప్రభుత్వ విద్యుత్ శాఖ అధికారులు ఏడి చంద్ర మోహిలి , ఏఈ సంపత్ లైన్మెన్లు సాంబయ్య రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లి హనుమంతరావు సహకారంతోనే డివిజన్ అభివృద్ధి



**ఈస్ట్ ఆనంద్ బాగ్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్**

నీలగిరి వార్త.

మల్కాజిగిరి నియోజక వర్గం పరిధి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్య కర్తలతో సమావేశం నిర్వహించారు. సవరించిన నూతన ఓటర్ లిస్ట్ ప్రకారం బూతు వారీగా ఓటర్ల ను గుర్తించే పని చేపట్టాలని ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు శ్రీ లక్ష్మీ కాంత్ రెడ్డి కోరారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్ లో అభివృద్ధి సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు అయితున్నాయి అన్నారు. పార్టీ కార్యకర్తలకు తను ఏ సమయంలో అయినా అందుబాటులో ఉంటానని, ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్క కార్యకర్తకి తగిన గుర్తింపు లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి బ్లాకు అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అండగా ఉండాలని కోరారు. సీనియర్ నాయకులు బికే శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి గౌరవ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని డివిజన్ కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, యాదగిరి, డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, సీనియర్ నాయకులు సత్యమూర్తి ,మాజీ కౌన్సిలర్ వెంకటేష్, బ్రహ్మయ్య. రాము, రామకృష్ణ, నయీమ్, ములుగు శ్రీనివాస్, అరుణ్, రోజా, పద్మ, లక్ష్మి కవిత, మోయిన్, వాజిద్, పసియుద్దీన్, లఖాన్, పోషాలు, సోమయ్య, వజీద్, బుచ్చిబాబు, హరికిషన్, బాబు సత్యనారాయణ, సంపత్, నవీన్, కిషోర్ పాల్గొన్నారు

## రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి నీలగిరి వార్త మార్చి 25:



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిరుద్యోగయువత కొరకుచేపట్టినరాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైననిరుద్యోగులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని దామెరకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడారి పెద్దులు యాదవ్ అన్నారు.

## మునగాల కొక్కిరేని రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలి

**జిల్లాఆఫీసర్లనుకోరిన మండలకాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు సామాజికసేవాకార్యకర్త గంధం సైదులు**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త:మార్చి 25



మునగాల:హుజూర్నగర్, కోదాడ అభివృద్ధి ప్రదాతలు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి,పద్మావతి రెడ్డి,సహకారంతో నిర్మిస్తున్న మునగాల నుంచి కీతవారిగూడెం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుపై ప్రమాదకర మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని మంగళవారం ఓ ప్రకటనలో జిల్లా ఆఫీసర్లను కోరారు. రోడ్డునిర్మాణంలో ఆఫీసర్లు రహదారి వెంట ఉన్న యజమానులకు రోడ్డు మధ్య నుంచి 25 ఫీట్లు వరకు రోడ్డు నిర్మాణం చేస్తామని ఆ స్థలంలో నిర్మాణాలు ఉంటే తొలగించాలని నోటీసులు ఇచ్చినందున ఆ మేరకు ఎందుకు రోడ్డు నిర్మాణం చేయడం లేదని ప్రశ్నించడం జరిగింది అన్నారు. నోటీసులు తీసుకున్న యజమానులు తమకు సహకరించడం లేదని దీంతో తమకు ఎందుకు లే పంచాయతీ అంటూ ఏడు మీటర్ల వరకే రోడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేస్తున్న సమయంలో వెడల్పు కోసం సహకరించాల్సింది పోయి ఆఫీసర్ల మీద పంచాయతీ పెట్టుకోవడం తగదని ఇది ఒకసారి ఆలోచించాలని గ్రామస్తులను కోరారు ఇప్పటికైనా ఆఫీసర్లు నిబంధనల ప్రకారం ముందుకు పోవాలని అప్రూచ్ రోడ్లు సిమెంట్ కాంక్రీట్ తో కొంచెం దూరం ఏర్పాటు చేసి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్ అయినా ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం సైదులు కోరారు.

## క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ మానుకోండి. చట్టరీత్యా నేరం

**గోపి సర్కిల్ ఇన్స్పెక్టర్ మట్టేవాడ**



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ చేయడం చట్టరీత్యా నేరం. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్స్ మానుకొండి బెట్టింగ్స్ వేసి డబ్బులు నష్టపోయి జీవితా లను నాశనం చేసుకోవద్దు.

## ఇద్దరికీ సామాజిక సేవ శిక్ష, 19 మందికి జరిమానా.

వరంగల్ సిటీ నీలగిరి వార్త.

మంగళవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లో, శ్రీయుత వరంగల్ పోలీస్ కమీషనర్ సంప్రీత్ సింగ్ %ఖూా%, శ్రీ %ు%. సత్యనారాయణ %ూాజూ% పర్యవేక్షణ లో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన(21) మంది వ్యక్తులను, మేజిస్ట్రేట్ శ్రీ అబ్బోజు. వేంకటేశం ఎదుట హాజరు పరచగా, %=%1 మాడుగుల రామకృష్ణ %ం/శీ% భీమయ్య, %ఖుస్త్రవ%.40,వృత్తి. డ్రైవర్ %తీ/శీ% మందమర్రి, మంచిర్యాల కు 2000 రూపాయల జరిమానా మరియు (3) రోజుల సామాజిక సేవా శిక్ష, %=%2.అలుగోజు రాజ్ కుమార్ %ం/శీ% సదానందం %ఖుస్త్రవ%.37, వృత్తి. కూలీ, %తీ/శీ% వనామాల కనిపర్తి, వరంగల్ కు (2) రోజుల సామాజిక సేవా శిక్ష పడగా ప్రొఫెసర్ వెటర్నరీ హాస్పిటల్ %వీ+వీ% వద్దకు పంపి, మిగత (19) మంది వ్యక్తులకు 20,600/-రూపాయల జరిమానా విధించారు.

## ఆర్ టీ సీ హయత్ నగర్ 2 డిపో ను సందర్శించిన సిటీ డిప్యూటీ ఆర్ ఎం శంకర్



హయత్ నగర్. నీలగిరి వార్త

టి జి ఎస్ ఆర్ టి సి హైదరాబాద్ సిటీ రీజియన్కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఆర్ ఎం %వీ% వి శంకర్ హయత్ నగర్ -2 డిపోను సందర్శించారు . డిపోలోని ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, చార్జింగ్ పాయింట్లను తనిఖీ చేసి భద్రత చర్యలపై సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వడం జరిగినది. డ్రైవర్లు డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, కే ఎం పి ఎల్ తేవడానికి కృషి చేయాలని కోరారు. "వరల్డ్ వాటర్" డే సందర్భంగా నీటి వినియోగాన్ని తగ్గించాలని, నీటిని వృధా చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస రావు , అసిస్టెంట్ మేనేజర్లు కే ఎన్ రావు మరియు టి రమాదేవి , మరియు ఎడిసి యాదగిరి తదితరులు పాల్గొన్నారు .